శవాల దిబ్బగా వయనాడ్

- శిథిలాల నుంచి బయటపడుతున్న శవాలు
- 270కు చేరిన మరణించిన వారి సంఖ్య
- ఇంకా దొరకని 200 మంది ఆచూకీ
- తమవారి జాడ కోసం ఆప్తుల వెతుకులాట
- 500కు పైగా ఇండ్ల ఆనవాళ్లే లేని వైనం
- 'ఘోస్ట్ టౌన్'లుగా ముండక్కై, చూరల్‌మల

వయనాడ్, జూలై 31: ప్రకృతి మిగిల్చిన విలయంతో వయనాడ్ మరుభూమిగా మారిపోయింది. ఎటుచూసినా శిథిలాలతో విషాదదృశ్యాన్ని తలపిస్తున్నది. శిథిలాలను తొలగించిన కొద్దీ మృతదేహాలు బయట పడుతున్నాయి. చలియార్ నదిలో శవాలు కొట్టుకొస్తూనే ఉన్నాయి. వందలాది ఇండ్ల ఆనవాళ్లే కనిపించడం లేదు. ఇప్పటికీ వందల సంఖ్యలో ప్రజల ఆచూకీ దొరకడం లేదు. తమవారి జాడ తెలియక వారి ఆప్తులు ఆందోళన చెందుతున్నారు. తమ కండ్ల ముందే కుటుంబసభ్యులు వరదలో కొట్టుకుపోయారని చెప్తూ కన్నీటిపర్యంతమవుతున్నారు. అనేక ఇండ్లు బురదలో మునిగిపోయాయి. ముండక్కై, చూరల్‌మల, మెప్పడిలో ఎటుచూసినా హృదయవిదారక పరిస్థితులే కనిపిస్తున్నాయి.

270కి చేరిన మృతుల సంఖ్య

కొండచరియలు విరిగిపడ్డ ఘటనలో ఇప్పటివరకు 270 మృతదేహాలు లభ్యమయ్యాయి. చలియార్ నదిలో కొట్టుకువచ్చిన 83 మృతదేహాలను బయటకు తీశారు. 166 మృతదేహాలకు పోస్ట్‌మార్టమ్ పూర్తికాగా, 32 మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు. ఇప్పటికీ అధికారికంగా 200 మంది ఆచూకీ దొరకడం లేదు. 191 మంది తీవ్ర గాయాలతో వేర్వేరు దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వం 45 సహాయక శిబిరాలు ఏర్పాటు చేసి 3,069 మందిని తరలించింది. ఇప్పటికే విరిగిపడ్డ కొండచరియలను చాలావరకు తొలగించలేదు. అనేక ఇండ్లలోకి సహాయక సిబ్బంది చేరుకోలేదు. దాదాపు 500 ఇండ్లు పూర్తిగా వరదలో కొట్టుకుపోయాయని స్థానికులు చెప్తున్నారు. దీంతో, మృతులు, గల్లంతైన వారి సంఖ్య భారీగా ఉండే అవకాశం ఉంది.

అప్పటికప్పుడు వంతెనలు నిర్మించి..

ముండక్కై, చూరల్‌మల, మెప్పడిలో మంగళవారం రాత్రి నిలిచిపోయిన సహాయక చర్యలు బుధవారం వేగం పుంజుకున్నాయి. ఎన్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, ఆర్మీ, నేవీ, ఇండియన్ కోస్ట్ గార్డ్ సిబ్బంది బాధితులను రక్షించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ముండక్కై, చూరల్‌మల మధ్య వంతెన కూలిపోవడం సహాయక చర్యలకు ప్రధాన అడ్డంకిగా మారింది. దీంతో ఆర్మీ సిబ్బంది తాత్కాలిక వంతెనను యుద్ధప్రాతిపదికన నిర్మిస్తున్నారు. చిన్న వరద ప్రవాహాల మీదుగా అప్పటికప్పుడు కూలిన చెట్లు, ఇసుక బస్తాలతో తాత్కాలిక వంతెనలు వేసి బాధితులను సురక్షితంగా బయటకు తీసుకొస్తున్నారు. ఇక, మెప్పడిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సైతం సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. శిబిరాల్లోని బాధితులకు సేవలందిస్తున్నారు.

సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా లభ్యమైన మృతదేహాన్ని తీసుకొస్తున్న రెస్క్యూ సిబ్బంది

'ఎవరైనా వచ్చి మమ్మల్ని కాపాడండి'

చూరల్‌మల గ్రామంలో ఆచూకీ లభించని నీతూ జోజో తన ప్రాణాలు కాపాడుకునేందుకు చివరి నిమిషం వరకు చేసిన ప్రయత్నం వెలుగులోకి వచ్చింది. ఆమె స్థానిక మెడికల్ కాలేజీలో పనిచేస్తారు. తన ఇంట్లోకి వరద నీరు చేరడంతో నిద్ర లేచిన ఆమె ఆందోళన చెందారు. తాను పని చేసే కాలేజీకి మంగళవారం తెల్లవారు జామున 1.30 నుంచి 2.30 మధ్య మూడుసార్లు ఫోన్ చేశారు. 'మా ఇల్లు మొత్తం నీటితో నిండిపోయింది. మమ్మల్ని కాపాడేందుకు ఎవరినైనా రమ్మని చెప్పండి. లేకపోతే మేము కొట్టుకుపోతాం' అని ఆమె వేడుకున్నారు. చూరల్‌మలకు వెళ్లే వంతెన తెగిపోవడంతో ఆమె స్నేహితులు, కాలేజీ సిబ్బంది నిస్సహాయంగా మిగిలిపోయారు. ఆమెకు 2.50కి తిరిగి ఫోన్ చేసేటప్పటికీ నీతూ ఆచూకీ గల్లంతైంది. నీతూ ఇంటి వంటగది కొట్టుకుపోయింది. ఆమె కుటుంబం మాత్రం ప్రాణాలతో బయటపడింది.

నాలుగు దశాబ్దాల్లో రెండు ఘటనలు

ముండక్కైలో గతంలోనూ కొండచరియలు విరిగిపడ్డ ఘటనలు జరిగాయి. 1984 జూలై 1న పెద్దఎత్తున ఈ పట్టణంపై కొండచరియలు విరుచుకుపడగా 14 మంది మరణించారు. అప్పుడు కూడా పలువురి మృతదేహాలు చలియార్ నదిలో లభ్యమయ్యాయి. 2019 ఆగస్టు 8న భారీ వర్షాలు కురవడంతో మరోసారి కొండచరియలు పట్టణంపై విరుచుకుపడగా 22 మంది మరణించారు.

ఘోస్ట్ టౌన్‌లుగా ముండక్కై, చూరల్‌మల

కొండచరియలు విరిగిపడటం, వరద ముంపునకు గురికావడంతో ముండక్కై, చూరల్‌మల పట్టణాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వందల సంఖ్యలో ఇండ్లు కూలిపోయాయి. ఇంకొన్ని ఇండ్లు వరదప్రవాహంలో కొట్టుకుపోయాయి. రెండు పట్టణాలు మొత్తం బురదతో నిండిపోయాయి. దగ్గరలో జలపాతాలు ఉండటంతో పర్యాటకులతో నిత్యం కళకళలాడే ఈ ప్రాంతాలు ఇప్పుడు ఘోస్ట్ టౌన్‌లను తలపిస్తున్నాయి. ఈ పట్టణాల్లోని పలు ప్రాంతాల ఆనవాళ్లే కనిపించడం లేదు.

కొండ చరియలు విరిగిపడిన ప్రాంతంలో రోప్ సాయంతో ప్రజలను కాపాడుతున్న రెస్క్యూ సిబ్బంది.. చిత్రంలో భారీ సైజ్‌లో కనిపిస్తున్న బండరాళ్లు

ముందే హెచ్చరించాం

కేరళలో భారీ వర్షాలు కురుస్తాయని, కొండచరియలు విరిగిపడే అవకాశం ఉందని జూలై 23, 24, 25, 26 తేదీల్లో కేంద్రం హెచ్చరించింది. అయినా కేరళ ప్రభుత్వం అప్రమత్తం కాకుండా అసలు ఏం చేసింది ? ప్రజలను సురక్షిత ప్రాంతాలకు ఎందుకు తరలించలేదు ? తరలిస్తే ఇప్పుడు ఎందుకు మరణించారు ?ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది.

–కేంద్ర మంత్రి అమిత్‌షా

ఘటన తర్వాతే రెడ్ అలర్ట్

115-204 మి.మీ. మధ్య వర్షపాతం కురుస్తుందనే కేంద్రం చెప్పింది. కానీ 572 మి.మీ. వర్షపాతం నమోదైంది. కొండచరియలు విరిగిపడ్డ తర్వాతనే రెడ్ అలర్ట్ జారీ చేసింది. నదులకు సంబంధించి సీడబ్ల్యూసీ హెచ్చరికలు జారీ చేయలేదు. కొండచరియలు విరిగిపడే చిన్నపాటి ఘటనలు జరగొచ్చని మాత్రమే జీఎస్ఐ గ్రీన్ అలర్ట్ జారీ చేసింది. నిందలు వేసుకునేందుకు ఇది సమయం కాదు.

–కేరళ సీఎం విజయన్

ఒకరినొకరు హత్తుకొని మృత్యుఒడిలోకి

సహాయక సిబ్బంది కూలిపోయిన ఇండ్ల శిథిలాలను, ఇండ్లను ముంచేసిన బురదను తొలగించినప్పుడు మనస్సును కలిచివేసే దృశ్యాలు కనిపిస్తున్నాయి. కూర్చున్నట్టుగా కొందరి మృతదేహాలు లభ్యం కాగా, మరికొందరు మంచంపై నిద్రించినట్టుగానే మరణించారు. కొందరు వరద నుంచి ప్రాణాలు కాపాడుకునేందుకు చివరి క్షణం వరకు తీవ్రంగా ప్రయత్నించినట్టు కనిపిస్తున్నది. ఒకరినొకరు గట్టిగా హత్తుకున్న స్థితిలో నలుగురి మృతదేహాలు లభించాయి.

రెండు కుటుంబాలను కాపాడిన ఆవు

చూరల్‌మలలో ఓ కుటుంబాన్ని ఇంట్లో పెంచుకున్న ఆవు కాపాడింది. సోమవారం అర్ధరాత్రి వినోద్ ఇంటి పశువులకొట్టంలోని ఆవు అరవడం ప్రారంభించింది. వినోద్ వెళ్లి చూడగా మొత్తం వరదనీరు చుట్టుముట్టింది. దీంతో తన కుటుంబసభ్యులు ముగ్గురిని నిద్రలేపి కొండపైన సురక్షిత ప్రాంతానికి వెళ్లారు. మెప్పడి గ్రామంలోని తన అత్తవారింటికి ఫోన్ చేయడంతో వారూ సురక్షిత ప్రాంతానికి వెళ్లి ప్రాణాలు దక్కించుకున్నారు.

నిండిపోతున్న మార్చురీలు..

కొన్ని కుటుంబాల్లో ఒక్కరు కూడా మిగలకపోవడంతో వారి అంత్యక్రియలను వాలంటీర్లే పూర్తి చేస్తున్నారు. మెప్పడిలోని జుమా మసీదులో 30 మృతదేహాల అంత్యక్రియలను తామే జరిపినట్టు మసీదు కమిటీ ఉపాధ్యక్షుడు ముస్తఫ మౌలవి తెలిపారు. ముండక్కైలోని ఓ మసీదులో సామూహికంగా అంత్యక్రియలు జరిగాయి. ఇప్పటికీ చాలామంది మృతదేహాలను గుర్తుపట్టేందుకు ఎవరూ లేకపోవడంతో మార్చురీలు నిండిపోతున్నాయి.

7 నదుల ఉగ్రరూపం

కేరళలో ఏడు నదుల్లో నీటి మట్టం ప్రమాదకర స్థాయికి పెరిగిందని సెంట్రల్ వాటర్ కమిషన్ హెచ్చరించింది. ఏడు నదులకు సంబంధించి ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. మరో ఐదు నదులకు సంబంధించి యెల్లో అలెర్ట్ జారీ చేసింది. ఈ నదుల పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

యూపీ అసెంబ్లీ భవనంలోకి వర్షపు నీరు

లక్నో: ఉత్తరప్రదేశ్ శాసనసభ భవనంలోకి బుధవారం వర్షపు నీరు చేరింది. వర్షాకాల సమావేశాలు జరుగుతుండగా ఈ పరిస్థితి ఏర్పడటంతో ప్రతిపక్షాలు తీవ్రంగా విరుచుకుపడ్డాయి. బుధవారం రెండు గంటలపాటు వర్షం కురవడంతో, శాసనసభ భవనంలోని కొన్ని చోట్ల, భవనం వెలుపల నీరు చేరింది. దీంతో సిబ్బంది బకెట్లు, మాప్‌లతో నీటిని బయటకు పంపించేందుకు శ్రమించారు. రాష్ట్ర శాసనసభకు ఎక్కువ బడ్జెట్ అవసరమంటూ సమాజ్‌వాదీ పార్టీ నేత, ఎమ్మెల్యే శివపాల్ సింగ్ యాదవ్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై నేడు సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ: షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తరగతుల్లో ఉప వర్గీకరణ అనుమతించదగినదేనా? అనే అంశంపై సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం తీర్పు చెప్పబోతున్నది. మూడు రోజులపాటు వాదనలను విన్న తర్వాత తీర్పును ఫిబ్రవరి 8న వాయిదా చేసిన సంగతి తెలిసిందే. స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దవిందర్ సింగ్ కేసులో ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ అంశాన్ని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి 2020లో నివేదించింది. వర్గీకరణ అనుమతించదగినది కాదని ఈవీ చిన్నయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో కోఆర్డినేట్ ధర్మాసనం ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించవలసిన అవసరం ఉందని ఐదుగురు సభ్యుల ధర్మాసనం చెప్పింది.

తోటి విద్యార్థిపై ఐదేండ్ల బాలుడి కాల్పులు!

పాట్నా: బీహార్‌లోని సుపౌల్ జిల్లాలోని లాల్‌పత్తిలో ఐదేళ్ల బాలుడు మరో బాలుడిపై కాల్పులు జరిపాడు. ఎస్పీ శైశవ్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం, ఓ ప్రైవేట్ పాఠశాలలో నర్సరీ విద్యార్థి (5) బుధవారం తన బ్యాగులో ఓ హ్యాండ్ గన్ పెట్టుకుని పాఠశాలకు వెళ్లాడు. అదే బడిలో మూడో తరగతి చదువుతున్న పదేండ్ల బాలుడిపై కాల్పులు జరిపాడు. ఆ బాలుని చేతికి గాయమైంది. బాలుడిని వెంటనే దవాఖానకు తరలించారు. ఈ బాలుని వద్దకు తుపాకీ ఎలా వచ్చింది? దానిని పాఠశాలకు ఏ విధంగా తీసుకురాగలిగాడు? అనే అంశాలపై దర్యాప్తు జరుగుతున్నది.

మాక్రాన్‌కు మహిళా మంత్రి ముద్దు

పారిస్: ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌కు ఓ మహిళా మంత్రి ముద్దు పెట్టడం వివాదాస్పదమైంది. పారిస్ ఒలింపిక్స్ ప్రారంభ వేడుకల సందర్భంగా మాక్రాన్ సహా పలు దేశాల ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ దేశ క్రీడల మంత్రి ఎమిలీ కాస్టెరా.. మాక్రాన్‌ను కౌగిలించుకొని చెంపపై ముద్దుపెట్టారు.

బీజేపీ పాదయాత్రలో పాల్గొనం: జేడీఎస్

న్యూఢిల్లీ: కర్ణాటకలో బీజేపీ పాదయాత్ర నుంచి తప్పుకుంటున్నట్టు మిత్రపక్ష జేడీఎస్ ప్రకటించింది. ముడా స్కామ్‌పై ఆగస్టు 3 నుంచి 10 వరకు బెంగళూరు నుంచి మైసూరు వరకు బీజేపీ చేపట్టిన పాదయాత్రలో పాల్గొనటం లేదని జేడీఎస్ నేత, కేంద్ర మంత్రి కుమారస్వామి ప్రకటించారు.వర్షాలతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారని, పాదయాత్రకు సమయం కాదని అన్నారు. అంతేకాదు బీజేపీ తీరుపై ఆయన మండిపడ్డారు. పాదయాత్ర చేపట్టడంపై జేడీఎస్‌ను బీజేపీ సంప్రదించలేదని ఆయన తప్పుబట్టారు.

ఇవేం స్కామ్‌లు.. మీదేం కత!

మొదటిపేజీ తరువాయి...

సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను మంగళవారం ఢిల్లీకి పిలిపించుకొన్న కాంగ్రెస్ అగ్రనేతలు వారితో ఏకాంతంగా భేటీ అయ్యి ఈ అంశాలపై ఆరా తీసినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఈ భేటీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్, సూర్జేవాలా పాల్గొన్నారు. ప్రతిపక్ష నేతలు ఉద్దేశపూర్వకంగా తమ సర్కారుపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని భేటీ సమయంలో సిద్ధరామయ్య, డీకే శివకుమార్ అధిష్ఠాన పెద్దలకు వివరణ ఇచ్చే ప్రయత్నం చేసినట్టు తెలుస్తున్నది. అయితే, ఏడాది గడువక ముందే ప్రభుత్వంపై ఇలాంటి ఆరోపణలు రావడం మంచిదికాదని, త్వరగా సమస్యను సరిదిద్దాలని అగ్రనేతలు కన్నడ నాయకులకు సూచించినట్టు సమాచారం.

'ముడా'పై మీ వివరణ ఏంటి?

ముడా భూ పంపిణీ వివాదంపై వివరణ ఇవ్వాలంటూ సీఎం సిద్ధరామయ్యను కర్ణాటక గవర్నర్ తావర్ చంద్ గెహ్లాట్ కోరారు. ముడా కేసును సీబీఐకి బదిలీ చేయాలని, స్కామ్‌లో భాగమైన సిద్ధరామయ్య సీఎం పదవికి రాజీనామా చేయాలంటూ ఈ నెల 25న బీజేపీ నేతలు గవర్నర్‌కు ఓ మెమోరాండమ్‌ను సమర్పించారు. ఈ క్రమంలోనే గవర్నర్.. ముఖ్యమంత్రి స్పందన కోరినట్టు రాజ్‌భవన్ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. కాగా, గవర్నర్ పదవిని బీజేపీ రాజకీయంగా వాడుకొంటున్నదని కాంగ్రెస్ నేతలు విమర్శించారు.

కుంభకోణాల కథ ఇది..

మైసూరు శివారుల్లోని గ్రామీణ ప్రాంతాల్లో సిద్ధరామయ్య భార్య పార్వతమ్మకు 3 ఎకరాల 16 గుంటల భూములు ఉన్నాయి. అయితే, అవసరాల దృష్ట్యా ఆ భూములను సేకరించిన ప్రభుత్వం.. వాటికి బదులుగా నగరంలోపల అత్యంత ఖరీదైన ప్రాంతాలుగా చెప్పుకొనే విజయనగర్, దట్టగల్లీ, జేపీ నగర్, ఆర్టీ నగర్, హంచయా-సతాగల్లీలో సిద్ధరామయ్య కుటుంబానికి భూములను కేటాయించింది. 50:50 నిష్పత్తిలో (పడావు పడ్డ ఒక ఎకరా తీసుకొంటే, అభివృద్ధి చేసిన అర్ధ ఎకరం ఇవ్వడం) ఈ భూముల కేటాయింపు జరిగింది. అయితే, సిద్ధరామయ్య కుటుంబానికి అత్యంత ఖరీదైన ప్రాంతాలలో రూ.4 వేల కోట్ల విలువజేసే ఆ భూములను కేటాయించాలని ఎవరు సిఫారసు చేశారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. దీన్నే మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) స్కామ్‌గా చెప్తున్నారు. వాల్మీకి కార్పొరేషన్ సూపరింటెండెంట్ పీ చంద్రశేఖరన్ గత మే 26న ఆత్మహత్య చేసుకోవడంతో ఎస్టీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణం వెలుగు చూసింది. వాల్మీకి కార్పొరేషన్ నుంచి పలు బ్యాంకు ఖాతాలకు చట్ట విరుద్ధంగా రూ.187 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేశారని చంద్రశేఖరన్ తన సూసైడ్ నోటులో పేర్కొనడం గమనార్హం. ఈ స్కామ్‌లో ప్రభుత్వపెద్దల హస్తం ఉన్నదని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు.

నేటి నుంచి ఫాస్టాగ్ కొత్త రూల్స్

న్యూఢిల్లీ, జూలై 31: నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్పీసీఐ) తీసుకొచ్చిన ఫాస్టాగ్ కొత్త నిబంధనలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి రానున్నాయి. కొత్త రూల్స్ ప్రకారం మూడు నుంచి ఐదేండ్ల క్రితం జారీచేసిన ట్యాగ్‌లకు ఈ ఏడాది అక్టోబర్ 31లోగా తప్పనిసరిగా అప్‌డేట్ కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. ఐదేండ్ల కంటే పాతవైన ఫాస్టాగ్‌లను మార్చుకోవాల్సి ఉంటుంది. యజమానులు తమ ఫాస్టాగ్‌లను రిజిస్ట్రేషన్, ఛాసిస్ నంబర్లకు డెడ్‌లైన్‌లోగా లింక్ అయ్యేలా చూసుకోవాల్సి ఉంటుంది. కొత్త వాహనాల యాజమానులైతే రిజిస్ట్రేషన్ నంబర్లను 90 రోజుల్లోగా అప్‌డేట్ చేయాలి. 30 రోజుల గడువులోగా చేయకపోతే బ్లాక్‌లిస్టులో పెడతారు.

ప్రొవైడర్లకు అదనపు రూల్స్

ఫాస్టాగ్ ప్రొవైడర్లకు కూడా ఎన్పీసీఐ అదనంగా పలు రూల్స్ తీసుకొచ్చింది. వాహనానికి సంబంధించి కచ్చితమైన సమాచారాన్ని వెరిఫై చేసి డాటాబేస్‌ను అప్‌డేట్ చేయాలి. సులభంగా గుర్తించేలా వాహనం ముందు, పక్కవైపు ఫొటోలను స్పష్టంగా అప్‌లోడ్ చేయాలి.

ఖేద్కర్‌పై నిషేధం

- ఆమె ఐఏఎస్ అభ్యర్థిత్వం రద్దు
- భవిష్యత్తు సెలక్షన్లపైనా బ్యాన్

న్యూఢిల్లీ/ముంబై, జూలై 31(నమస్తే తెలంగాణ): వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ అధికారి పూజా ఖేద్కర్‌పై వేటు పడింది. ఆమె ప్రొవిజనల్ అభ్యర్థిత్వాన్ని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) రద్దు చేసింది. భవిష్యత్తులోనూ ఆమె కమిషన్ నిర్వహించే పరీక్షలకు హాజరు కాకుండా నిషేధం విధించింది. ఈ మేరకు యూపీఎస్సీ బుధవారం ప్రకటించింది. పూజ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2022 (సీఎస్ఈ-2022) ప్రొవిజనల్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేసినట్టు తెలిపింది. యూపీఎస్సీ పరీక్షలు, సెలక్షన్ల నుంచి ఆమెను శాశ్వతంగా డీబార్ చేసినట్టు వివరించింది. అధికార దుర్వినియోగం ఆరోపణలు ఎదుర్కొంటున్న పూజకు యూపీఎస్సీ జూలై 18న షోకాజ్ నోటీసులు జారీ చేసింది. 25న అవసరమైన పత్రాలతో తమ ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. అయితే, పత్రాలు సమకూర్చుకునేందుకు ఆగస్టు 4 వరకు సమయం ఇవ్వాలని పూజ కోరారు. అందుకు నిరాకరించిన అధికారులు జూలై 30న మధ్యాహ్నం 3.30 గంటల్లోపు హాజరు కావాలని, ఇదే చివరి అవకాశమని హెచ్చరించారు. అయినప్పటికీ యూపీఎస్సీ ఎదుట హాజరై వివరణ ఇవ్వడంలో విఫలం కావడంతో పూజ ప్రొవిజనల్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయడంతోపాటు, భవిష్యత్తులోనూ కమిషన్ నిర్వహించే నియామక పరీక్షల్లో పాల్గొనకుండా పూజా ఖేద్కర్‌పై శాశ్వత నిషేధం విధించారు.

యూపీఎస్సీ చైర్‌పర్సన్‌గా ప్రీతి సుదాన్

యూపీఎస్సీ నూతన చైర్‌పర్సన్‌గా మాజీ ఆరోగ్య కార్యదర్శి ప్రీతి సుదాన్ నియమితులయ్యారు. ప్రస్తుతం యూపీఎస్సీ సభ్యురాలిగా ఉన్న ఆమె గురువారం బాధ్యతలు స్వీకరిస్తారు. ఇప్పటివరకు యూపీఎస్సీ చైర్మన్‌గా ఉన్న మనోజ్ సోని ఈనెల 4న రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కాగా 2025 ఏప్రిల్ 29 వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఏది ముందైతే అప్పటివరకు సుదాన్ ఈ పదవిలో కొనసాగుతారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 1983 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన సుదాన్ పలు హోదాలలో పనిచేశారు. 2020 జూలై వరకు కేంద్ర ఆరోగ్య కార్యదర్శిగా ఉన్నారు. యూపీఎస్సీ చైర్‌పర్సన్‌గా ఒక మహిళను నియమించడం ఇది రెండోసారి. అంతకు ముందు 1996లో చైర్‌పర్సన్‌గా ఆర్ఎం బాథ్యూ వ్యవహరించారు.

లోక్‌సభలో ముదిరిన 'కుల' వివాదం

రాహుల్‌ను ఉద్దేశించి బీజేపీ ఎంపీ అనురాగ్ వ్యాఖ్యలు వివాదాస్పదం

న్యూఢిల్లీ, జూలై 31: లోక్‌సభలో 'కుల' వివాదం ముదురుతున్నది. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి మంగళవారం బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. బడ్జెట్‌పై రాహుల్ గాంధీ ప్రసంగానికి కౌంటర్ ఇచ్చిన అనురాగ్ ఠాకూర్.. 'వారి కులం ఏంటో కూడా తెలియని వారు కులగణన గురించి మాట్లాడుతున్నారు' అని వ్యాఖ్యానించారు. ఠాకూర్ వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎంపీలు తీవ్రంగా తప్పుపట్టారు. లోక్‌సభలో ఆందోళన చేపట్టారు. ఈ వివాదం బుధవారం కూడా కొనసాగింది. ఠాకూర్ ఎవరినీ ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేయకపోయినా రాహుల్ గాంధీ ఆయనను అవమానించారని అనడం ఆశ్చర్యకరమని బీజేపీ ఎంపీ, అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర పేర్కొన్నారు.

ప్రధానిపై ప్రివిలేజ్ మోషన్ నోటీసు

లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించిన అనురాగ్ ఠాకూర్ వ్యాఖ్యల వీడియోను ప్రధానమంత్రి మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారని కాంగ్రెస్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ ఆరోపించారు. ప్రధానిపై సభా హక్కుల ఉల్లంఘనకు అనుమతించాలని కోరారు.

హమాస్ చీఫ్ హనియా హతం

- ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని నివాసంపై వైమానిక దాడి
- ధ్రువీకరించిన ఇరాన్, హమాస్
- ఇజ్రాయెల్ పనేనని ఆరోపణ
- ప్రతీకారం తప్పదని హెచ్చరిక
- హత్యపై ఇజ్రాయెల్ నో కామెంట్

బీరుట్, జూలై 31: ఇజ్రాయెల్‌తో గత ఏడాది కాలంగా యుద్ధం చేస్తున్న హమాస్ మిలిటెంట్ గ్రూపునకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. హమాస్ పొలిటికల్ చీఫ్ ఇస్మాయిల్ హనియా ఇరాన్‌లో హత్యకు గురయ్యాడు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ఆయన నివాసంపై బుధవారం తెల్లవారక ముందు 2 గంటల సమయంలో జరిగిన వైమానిక దాడిలో హనియా మరణించాడని ఇరాన్ ప్రభుత్వంతోపాటు హమాస్ గ్రూపు కూడా ధ్రువీకరించింది. దాడిలో హనియాతోపాటు ఆయన బాడీగార్డు కూడా మరణించాడని తెలిపాయి. ఇరాన్ కొత్త అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రమాణ స్వీకారానికి హాజరై, ఇంటికి వచ్చిన తర్వాత ఈ దాడి జరిగినట్టుగా సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. లెబనాన్ రాజధాని బీరుట్‌లో ఇరాన్ మద్దతు గల హెజ్బొల్లా టాప్ కమాండర్‌ను హతమార్చినట్టు ఇజ్రాయెల్ మంగళవారం సాయంత్రం ప్రకటించగా.. దానికి కొద్ది గంటల తర్వాతనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

ఆయన ప్రతీకారమే మా డ్యూటీ

ఇజ్రాయెలే హనియాను హత్య చేసిందని ఇరాన్, హమాస్ ఆరోపించాయి. అయితే హనియా హత్యపై స్పందించేందుకు ఇజ్రాయెల్ నిరాకరించింది. హత్యలో తమ ప్రమేయం లేదని అమెరికా పేర్కొన్నది. మరోవైపు ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తప్పదని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హెచ్చరించారు. హనియా ప్రతీకారాన్ని తమ డ్యూటీగా తీసుకొంటామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇజ్రాయెల్ కఠిన శిక్షకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. హనియా హత్య నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రికత్తలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తున్నది.

ప్రపంచ దేశాల స్పందన

హనియా హత్య పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మార్చే అవకాశం ఉన్నదని ఈజిప్టు అభిప్రాయపడింది. హత్యపై సమగ్ర విచారణ జరపాలని మలేషియా కోరింది. ఉద్రిక్తతలు తగ్గించేందుకు తక్షణం శాంతియుత మార్గంలో నిర్మాణాత్మక చర్చలు జరగాల్సిన అవసరాన్ని ఈ ఘటన చెబుతున్నదని పేర్కొన్నది. ఇలా దాడులు, హత్యలకు పాల్పడుతుంటే మధ్యవర్తిత్వం ఎలా సక్సెస్ అవుతుందని ఖతార్ ప్రధాని షేక్ మహ్మద్ బిన్ అల్ థాని అన్నారు. ఈ రాజకీయ హత్య ఆమోదనీయం కాదని రష్యా పేర్కొన్నది.

ఎవరీ ఇస్మాయిల్ హనియా?

హనియా 1963లో గాజా సిటీకి సమీపంలోని ఒక శరణార్థి శిబిరంలో జన్మించాడు. 1980లో హమాస్ గ్రూపులో చేరగా.. 1990లో తొలిసారిగా హనియా పేరు వెలుగులోకి వచ్చింది. హమాస్ వ్యవస్థాపకుడు అహ్మద్ యాసిన్‌కు అత్యంత సన్నిహితుడిగా మెలిగిన హనియా.. 2004లో ఇజ్రాయెల్ దాడుల్లో యాసిన్ మరణించిన తర్వాత గ్రూపులో కీలక వ్యక్తిగా ఎదిగాడు. 2006లో పాలస్తీనా స్టేట్ ప్రధానిగా ఎంపికై గాజా స్ట్రిప్‌ను పాలించాడు. 2017లో హమాస్ చీఫ్‌గా ఎన్నికైన హనియాను.. అమెరికా ప్రపంచ ఉగ్రవాదుల జాబితాలో చేర్చింది. 2019లో ఆయన గాజా స్ట్రిప్‌ను వీడి ఖతార్‌లో నివాసం ఉంటున్నాడు.